## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



మలమీదపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

గాండ్లపెంట: కటారుపల్లి, తూపల్లి, మలమీదపల్లి, తుమ్మలబైలు, గొడ్డువెలగల, గాండ్లపెంట, కొట్లపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను కదిరి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంపీడీఓ రామానాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు ర్యాంప్ లాంటి సౌకర్యాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశా. కాగా కొట్లపల్లిలోని పాఠశాల మూత పడడంతో అక్కడ పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్డి, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని ఆర్డీఓ బీఎల్ఓకు సూచించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ముకుంద, ఆయా కేంద్రాల బీఎల్వోలు ఉన్నారు.

### మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ



విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల అందిస్తున్న బాలిరెడ్డి

ధర్మవరం అర్బన్: సుందరయ్యనగర్‌లోనున్న శ్రీ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడేలా మోడల్ టెస్ట్ పేపర్లున్న పుస్తకాలను అందించామన్నారు. మోడల్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### శివపార్వతుల కల్యాణానికి రూ.50 వేల విరాళం



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వైఎస్సార్‌కాలనీ శివాలయంలో శుక్రవారం జరగనున్న శివపార్వతుల కల్యాణం, అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ విరాళం అందించారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఆమె రూ.50 వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

### 'పల్లె చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

నల్లమాడ: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని చారుపల్లి పంచాయితీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఓ ప్రకటనలో హితవు పలికారు. పంచాయతీలోని సీ.రెడ్డివారిపల్లిలో గురువారం నూతన గృహ ప్రవేశానికి విచ్చేసిన పల్లె అదే కార్యక్రమానికి వచ్చిన పలువురు టీడీపీ కార్యకర్తలకు పచ్చ కండువాలు వేసి 20 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ప్రకటించుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కండువాలు వేయించుకున్న వారు ఇదివరకే టీడీపీకి చెందినవారని, ఒక్కరు కూడా వైఎస్సార్ సీపీకి చెందిన వారు లేరని తెలిపారు. పల్లె రఘునాథరెడ్డి మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని చారుపల్లి సర్పంచ్ ప్రమీలమ్మ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పమాంబ, మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు పీ.అశ్వర్థనారాయణ, డీలర్ మధుసూదన్‌రెడ్డి, ఎంసీ బయపరెడ్డి, సాతర్ల రామచంద్ర, అరుణ్ కుమార్, సుధాకర్, రత్నం, రమణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రామచంద్ర, గంగులప్ప, లక్ష్మీనాయక్ పేర్కొన్నారు.

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి రాజీనామా



చంద్రమోహన్‌రెడ్డి

తాడిమర్రి: పెద్దకోట్లకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దకోట్ల చంద్రమోహన్‌రెడ్డి గురువారం తన పదవికి, అలాగే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని శ్రీసత్యసాయి జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎం శేఖర్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరు ఎంతో బాగుందన్నారు. శనివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### సస్యరక్షణ చర్యలపై శిక్షణ

నల్లచెరువు: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఏఓ భారతి ఆధ్వర్యంలో పంటల సస్యరక్షణ చర్యలపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సలహా బోర్డు జిల్లా చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఏడీఏ సనావుల్లా హాజరయ్యారు. ఏఓ వరి, వేరుశనగ పంటల్లో సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

# సేవకులై... సంక్షేమ సారథులై..!

- పథకాల అమల్లో వలంటీర్ల కీలక పాత్ర
- నేడు ధర్మవరంలో 'వలంటీర్లకు వందనం'
- ఎమ్మెల్యే కేతిరెడ్డి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

బత్తలపల్లి: కుటుంబ సభ్యుల్లా.. ఆపదలో ఆపన్నహస్తంలా.. పథకాల అమలులో సారథుల్లా.. సేవలకు ప్రతిరూపంలా వలంటీర్ వ్యవస్థ పేరొందింది. దేశానికే ఆదర్శంగా నిలిచింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రభుత్వ పాలనలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. పథకాలను ప్రతి ఇంటికి చేరువ చేసింది. వలంటీర్లు యువ సైనికుల్లా, సేవాసారథుల్లా ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు చేరవేస్తున్న వీరి సేవలను మెచ్చి ప్రభుత్వం ఏటా వలంటీర్లకు వందనం పేరిట పురస్కారాలు అందిస్తోంది. వరుసగా నాలుగో ఏడాది కూడా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను అందించనుంది. ఈ ఏడాది పురస్కారాల నగదును గణనీయంగా



మంచానికి పరిమితమైన వ్యక్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పెద్దన్న

పెంచింది. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం ధర్మవరంలో నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతులు మీదుగా అవార్డులను అందజేయనున్నారు.

**సకాలంలో పింఛన్ ...**

గ్రామ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు కార్యాలయాల వద్ద చాలా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కొందరు వలంటీర్లు లబ్ధిదారుల ఇబ్బందులను తెలుసుకుని వారు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. మరికొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి మరీ పింఛన్ సొమ్మును అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు. అదేవిధంగా ప్రతి సంక్షేమ పథకానికి అర్హులైన వారిని గుర్తించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం మూడు రకాల అవార్డులను అందిస్తుంది. 95–100 శాతం పనితీరు కనబర్చిన వారికి సేవావజ్ర, 80–95 శాతం సాధించిన వారికి సేవారత్న, 60 శాతం పైగా సాధించిన వారికి సేవామిత్ర అవార్డులను అందజేయనున్నారు. అవార్డుల ప్రదానోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు.

**భారీగా పెరిగిన నగదు బహుమతులు**

ధర్మవరం మున్సిపాలిటీతో పాటు ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలున్నాయి. ఆయా మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లలో గతేడాది సేవా మిత్ర కింద ఎంపిక చేసిన వారికి రూ.10 వేలు, సేవా రత్న కింద రూ.20వేలు, సేవా వజ్ర కింద రూ.30వేలు వంతున అందించారు. ఈ ఏడాది నగదు బహుమతిని పెంచారు. సేవా మిత్రకు రూ.15వేలు, సేవా రత్నకు రూ.30వేలు, సేవా వజ్రకు రూ.45 వేలు నగదు బహుమతులను అందజేయనున్నారు.

**ధర్మవరం నియోజకవర్గంలో వలంటీర్ల వివరాలు ఇలా...**

| మండలం | వలంటీరు | సేవావజ్ర | సేవారత్న | సేవామిత్ర |
|---|---|---|---|---|
| ధర్మవరం అర్బన్ | 679 | 1 | 6 | 672 |
| ధర్మవరం రూరల్ | 191 | 2 | 5 | 184 |
| బత్తలపల్లి | 197 | 2 | 5 | 190 |
| తాడిమర్రి | 173 | 0 | 5 | 164 |
| ముదిగుబ్బ | 309 | 0 | 5 | 304 |

### రెండు సార్లు సేవారత్న



నా పరిధిలో కుటుంబాలకు వలంటీర్‌గా సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందిస్తున్నా. సేవలను గుర్తించి ప్రోత్సాహకం అందించడం సంతోషంగా ఉంది. సేవారత్న అవార్డుకు రెండు సార్లు ఎంపికయ్యాను.

–పెద్దన్న, వలంటీర్, బత్తలపల్లి.

### కష్టపడే వారికి గుర్తింపు..



కష్టపడే వారికి ఎప్పుడైనా తగిన గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేర్చడం, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని కేటాయించిన కుటుంబాలకు తెలియజేసి, అర్హులు ఉంటే అప్లికేషన్లు తీసుకుని మంజూరు చేయించడంతో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. పింఛన్లు సకాలంలో పంపిణీ చేసి ప్రజలకు నిత్యం అందుబాటులో సేవలు చేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా అవార్డులకు ఎంపిక చేసింది.

–శివనాగప్రసాద్, ఎంపీడీఓ, బత్తలపల్లి

# కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు

- ప్రతీ కార్యకర్తా కేతిరెడ్డి కుటుంబ సభ్యులే
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



హాజరైన నూతన పట్టణ కమిటీ సభ్యులు

ధర్మవరం: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే మూల స్తంభాలని, వారి అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ నూతన కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల గుండెచప్పుడు నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. రెండు సీట్లతో ప్రారంభమై 51శాతం ఓటు షేర్‌తో 151సీట్లలో గెలుపొంది దేశ చరిత్రలో రికార్డు సృష్టించిన ఏకైక పార్టీ తమదన్నారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటివద్దకే వెళ్లి సంక్షేమాన్ని అందించారన్నారు. ఈ రోజు దేశ వ్యాప్తంగా ఉన్న పలు రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థను కావాలని కోరుతున్నారంటే అది జగనన్న ముందుచూపునకు నిదర్శనమన్నారు. విద్య, వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలిచారన్నారు. జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, మంచిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. ప్రజలందరిని సంఘటితం చేసి వైఎస్సార్‌సీపీ రానున్న ఎన్నికల్లో 60 నుంచి 70శాతం ఓట్లు సంపాదించేలా పని చేయాలన్నారు.

**బ్యాంకు పాసుపుస్తకం చూపించండి**

టీడీపీ నాయకులు రెడ్‌బుక్ చూపించి అధికారంలోకి వస్తే ఏదో చేస్తామని అమాయకులను బెదిరిస్తున్నారని, మీరు సంక్షేమ లబ్ధికి సంబంధించిన బ్యాంక్ పాసుపుస్తకాన్ని చూపించి తేడాను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తనైనా టచ్ చేసి పొలిమేర దాటి వెళ్లే దమ్ము ఎవరికైన ఉందా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంటే కేతిరెడ్డి కుటుంబ సభ్యులన్నారు.

**బురద రాజకీయాలే తప్ప అభివృద్ధి చేయాలనే తపన లేదు**

నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన వరదాపురం సూరి, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు ఎప్పుడు అవాస్తవాలతో బురదజల్లడమే తప్ప అభివృద్ధి చేయాలన్న తపన లేదని ఎమ్మెల్యే విమర్శించారు. సూరి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోతానే నెలరోజులు గడవక ముందే కార్యకర్తలను నమ్ముకున్న వారిని నట్టేట ముంచి పార్టీ మారడం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పరిటాల కుటుంబం దశాబ్దాలుగా రాప్తాడులో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినప్పటికీ రోడ్లు వేయలేదన్నారు. ఇలాంటి వారు ఏం అభివృద్ధి చేయగలరన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, వైస్ చైర్మన్ మేముల జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథులు 'వలంటీర్లు'

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

కనగానపల్లి/రామగిరి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం కనగానపల్లి, రామగిరి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ, వర్గ విభేదాలు లేకుండా పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వృద్ధులకు అందించే పింఛన్ల నుంచి ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందించేలా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట సమయాల్లో వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

**వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం**

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. కానీ టీడీపీ నాయకులు వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలతో ఓట్లు వేయించుకుని పెత్తందార్ల పాలన సాగించారన్నారు. రాప్తాడు నియోజవర్గంలో పరిటాల కుటుంబ సభ్యులు బీసీ, ఎస్సీ వర్గాలను అడ్డం పెట్టుకుని ఫ్యాక్షన్ రాజకీయాలు నడిపి పదవులు పొందారన్నారు. అయితే వారు ఏనాడు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మేలు చేసింది లేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకర్గంలో జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 80 శాతం పైగా పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కట్టబెట్టామన్నారు. వీటి గుర్తించకుండా పరిటాల సునీత తిరిగి తమపైనే విమర్శలు చేయటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇక గత 25 ఏళ్లలో పరిటాల కుటుంబ సభ్యులు చేయని అభివృద్ధి పనులను తాము ఐదేళ్ల చేసి చూపించామన్నారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వలంటీర్లను ప్రత్యేకంగా సన్మానించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కనగానపల్లి ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, రామగిరి ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, కన్వీనర్ కత్రా హనుమంతరెడి, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ ప్రచారానికి జనాదరణ



తిప్పయ్యగారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి మండలంలో చేపట్టిన ప్రచారానికి ప్రజల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. వృద్ధులు మొదలుకొని రైతులు, మహిళలు, యువత ఉత్సాహంగా పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. గురువారం తిప్పయ్యగారిపల్లిలో అపర్ణారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అపర్ణారెడ్డి ప్రజలను కోరారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో ఇంటికి రూ.లక్షలు లబ్ధి చేకూర్చిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. దుద్దుకుంట అపర్ణారెడ్డికి మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. జెడ్పీటీసీ ఎస్.రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, సర్పంచ్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఎస్.చంద్రకళ, డీలర్ గంగిరెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నేడు రెడ్డిపల్లిలో ప్రచారం**

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి శుక్రవారం రెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

## సంక్షిప్త సమాచారం

**కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి**

తనకల్లు: తమని కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోమేనాయక్‌తండా వాసులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోమేనాయక్‌తండా నుంచి తవళానికి మట్టి రోడ్డు వేసుకున్నామన్నారు. అయితే రోడ్డు పక్కనే ఉన్న భూమిని బాగేపల్లి నాగరాజు అనే వ్యక్తి కొనుగోలు చేసి మామిడి తోటను సాగు చేస్తున్నాడని, నాగరాజు రోడ్డును కూడా ఆక్రమించి కంచె వేయడంతో తండాకు రోడ్డు లేకుండా పోయిందన్నారు. రోడ్డును ఎందుకు ఆక్రమించావని అడిగితే అక్రమ కేసులు పెట్టడమే కాకుండా కులం పేరుతో దూషించడంతో పాటు దౌర్జన్యానికి దిగుతున్నాడని వాపోయారు.

**లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పరిశీలన**

ధర్మవరం అర్బన్: లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం అమలుపై పాఠశాల స్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని సంజయ్‌నగర్ బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ, రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, డేవిడ్ బర్నడ్ తనిఖీ చేశారు. తరగతి గదిలో లోపాలను గుర్తించి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా లిప్ బేస్ లైన్‌తో ప్రారంభించి ప్రతినెలా విద్యార్థులు ప్రగతి సాధిస్తున్నారా లేదా తెలుసుకునేందుకు మూల్యాంకనం చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో సోమప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ**

కనగానపల్లి: పాతపాళ్యంలో గురువారం సోమప్ప స్వామి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. సోమప్ప స్వామి కాపుల ఆధ్వర్యంలో రూ.కోటి పైగా వెచ్చించి నిర్మించిన ఈ ఆలయానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విరాళం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడికి ఆపన్నహస్తం**

ఓడీచెరువు: అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడికి పలువురు ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. కమ్మవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న 98 డీఎస్సీ ఉపాధ్యాయుడు నేలకోటప్ప ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో అనంతపురంలోని ప్రైవేటులో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న చింతమానిపల్లి సర్పంచు జగన్‌మోహన్‌చౌదరి రూ.10 వేలు, ఓడీచెరువు సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి రూ.5 వేలు, సీనియర్ నేతలు నాగరాజు, వెంకటనారాయణ, నాగేంద్ర తదితరులు మొత్తం రూ.20,500 ఎంఈఓ సురేష్‌కు అందజేశారు.

**లక్ష్మీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం**

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**నిబంధనలు పాటించండి**

గాండ్లపెంట: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఎస్.క్రిష్ణవేణి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు.

**మద్యం స్వాధీనం**

తలుపుల: నంగివాండ్లపల్లిలో ఆదినారాయణమ్మ అనే మహిళ మద్యం అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.దిలీప్‌కుమార్ తెలిపారు.